

## నా విడుదలకు ఆదేశాలు
# ఇవ్వండి

మొదటి పేజీ తరువాయి...

సుప్రీంకోర్టులో తాను వేసిన పిటిషన్‌పై విచారణ పెండింగులో ఉన్నందున.. విచారణ పూర్తయ్యేవరకూ సమన్లు ఇవ్వబోమని ఈడీ సుప్రీంకోర్టు ఎదుట హామీ ఇచ్చిందని, ఇప్పుడు ఆ హామీని ఉల్లంఘించిందని కవిత పేర్కొన్నారు. ఈ కారణాల నేపథ్యంలో తన విడుదలకు ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో కోర్టుకు కవిత విజ్ఞప్తి చేశారు. కాగా, సర్వోన్నత న్యాయస్థానంలో కేసు విచారణ జరుగుతుండగానే తనను అక్రమంగా అరెస్ట్ చేశారని, కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు భావించి, దర్యాప్తు సంస్థపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కవిత సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అయితే.. ఆమె వేసిన పిటిషన్ అసంపూర్తిగా ఉందని సుప్రీంకోర్టు తెలిపింది. నిబంధనల మేరకు పిటిషన్ పూర్తి చేసి దాఖలు చేసిన తర్వాతే విచారిస్తామని స్పష్టం చేసింది. దీనితో కవిత తరఫున న్యాయవాదులు మంగళవారం మరోసారి పిటిషన్ దాఖలు చేశారు.

**రిట్ పిటిషన్ ఉపసంహరణ**

గతంలో సుప్రీంకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను కవిత వెనక్కి తీసుకున్నారు. ఢిల్లీ మద్యం కేసులో ఈడీ తనపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా చూడాలని, మహిళలను దర్యాప్తు కార్యాలయాలకు పిలవకుండా ఇంటివద్దనే విచారణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ గత ఏడాది మార్చి 14న కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాజాగా ఈ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది. అయితే, ఈ కేసులో ఇప్పటికే కవితను ఈడీ అధికారులు అరెస్టు చేశారని, కాబట్టి రిట్ పిటిషన్‌పై విచారణ అవసరం లేదని కవిత తరఫున సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి మంగళవారం ధర్మాసనానికి తెలియజేశారు. తమ వ్యాజ్యాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కేసులో చట్ట ప్రకారం ఉపశమనం పొందేందుకు తదుపరి చర్యలకు వెళ్తామన్నారు. దీంతో కవిత రిట్ పిటిషన్ ఉపసంహరణకు జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం అంగీకరించింది.

**తల్లి, కుమారులను కలుసుకునేందుకు అనుమతి**

ఈడీ కస్టడీలో ఉన్న కవిత.. తన తల్లి శోభ, కుమారులు ఆదిత్య, ఆర్య, సోదరీమణులు అఖిల సౌమ్య, వినుత, సోదరుడు ప్రశాంత్‌ను కలుసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు కుటుంబసభ్యులను కలుసుకునేందుకు కవితకు కోర్టు అనుమతి ఇచ్చింది. కవితను మంగళవారం ఆమె సోదరుడు కేటీఆర్, న్యాయవాది మోహిత్‌రావు కలిశారు. కేసుకు సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించినట్టు తెలిసింది. కవిత తల్లి శోభ బుధ, గురువారాల్లో ఢిల్లీకి రానున్నట్టు సమాచారం. కాగా, రోజురోజుకూ కవిత విచారణ సమయాన్ని ఈడీ పెంచుతోంది. మంగళవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, భోజన విరామం తర్వాత మధ్యాహ్నం 2 నుంచి 4.15 వరకు ప్రశ్నించినట్టు సమాచారం. ఆ తర్వాత కొద్దిసేపు టీ విరామం ఇచ్చి, మళ్లీ విచారణను ప్రారంభించినట్టు తెలిసింది. అందుకే, ప్రతిరోజూ 6 నుంచి 7 గంటల వరకు కుటుంబ సభ్యులు కలిసేందుకు అవకాశం ఇవ్వగా, మంగళవారం మాత్రం 7 తర్వాత అనుమతించారు.

**మద్యం కేసు న్యాయమూర్తి బదిలీ**

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి నాగ్‌పాల్ బదిలీ అయ్యారు. నాగ్‌పాల్ స్థానంలో కావేరీ బవేజా నియమితులయ్యారు. ఢిల్లీ హైకోర్టు జ్యుడీషియల్ సర్వీసెసలోని 27 మంది న్యాయమూర్తులను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

బదిలీ అయిన వారిలో నాగ్‌పాల్ కూడా ఉన్నారు. ఆయన ఇకనుంచి కమర్షియల్ కోర్టు-13, సెంట్రల్, తీస్ హజారీ కోర్టుల్లో న్యాయమూర్తిగా వ్యవహరించనున్నారు. ఢిల్లీ మద్యం కేసులో కవితతోపాటు ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్‌సింగ్ తదితరుల అరెస్టు కేసులను నాగ్‌పాల్ విచారించారు. ప్రస్తుతం.. సిసోడియా, సంజయ్‌సింగ్ జ్యుడీషియల్ కస్టడీలో ఉండగా, కవిత ఈడీ కస్టడీలో ఉన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగిస్తున్న ఉచ్చు!..

మొదటి పేజీ తరువాయి...

దీంతో అతడ్ని వికారాబాద్ తీసుకెళ్లి ధ్వంసం చేసిన హార్డ్‌డిస్కులను స్వాధీనం చేసుకునేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. పంజాగుట్ట పోలీసులు ఈ కేసు నమోదు చేసినప్పటికీ.. ఇంటెలిజెన్స్ విభాగంలో అనుభవం ఉండి, ప్రస్తుతం పశ్చిమ మండలంలో పనిచేస్తున్న ఓ ఏసీపీ స్థాయి అధికారితోపాటు మరో ఇద్దరితో కూడిన ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో ప్రస్తుతం బంజారాహిల్స్ ఠాణాలో విచారణ జరుగుతోంది. ఇదిలా ఉండగా ఈ కేసుతో సంబంధం ఉన్న ఇద్దరు సీఐలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని వరంగల్ లో అదుపులోకి తీసుకొన్నారు. ఈ వ్యవహారంలో పాలుపంచుకున్నారని అనుమానిస్తున్న జిల్లాకు చెందిన ఇద్దరు సీఐలను ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్లు హైదరాబాదుకు విచారణ నిమిత్తం తరలించినట్టు తెలుస్తోంది. ఈ ఇద్దరు అధికారులూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నియోజకవర్గంలో పనిచేశారు. మరోవైపు ప్రణీత్ రావు వెనకాల మీడియా సంస్థ యజమాని ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఒక మీడియా సంస్థ యజమాని ఇచ్చిన నెంబర్లను ప్రణీత్ రావు ట్యాప్ చేసినట్లు గుర్తించారు పోలీసులు. ఆ మీడియా సంస్థ యజమాని దగ్గర ఒక సర్వర్ పెట్టినట్లు అనుమానిస్తున్నారు. బీఆర్ఎస్ కీలక నేత ఆదేశాలతో వరంగల్, సిరిసిల్లలో సర్వర్లు ఏర్పాట్లు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ అంశంపై లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నారు పోలీసులు. దీంతో ఎవరెవరిని అరెస్ట్ చేస్తారనేది హాట్ టాపిక్ గా మారింది.

# డిపాజిట్ దక్కకున్నా పోటీకి సై..

మొదటి పేజీ తరువాయి...

వారిలో 71,246 మందికి డిపాజిట్లే రాలేదు. అంటే 78 శాతం అభ్యర్థులకు ధరావతు దక్కలేదన్నమాట. 1951-52లో జరిగిన మొట్టమొదటి ఎన్నికల్లో 1874 మంది కి గాను 745 మంది అభ్యర్థులు డిపాజిట్ కోల్పోయారు. క్రమంగా ఈ సంఖ్య పెరుగుతూ వస్తోంది.

**11వ లోక్‌సభలో రికార్డు..**

1991-92లో 86శాతం మంది అభ్యర్థులు సెక్యూరిటీ డిపాజిట్లు కోల్పోయారు. 1996లో 11వ లోక్‌సభ ఎన్నికల్లో 91 శాతం అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. మొత్తం 13,952 అభ్యర్థులు బరిలో ఉండగా.. 12,688 మందికి చుక్కెదురైంది. అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు పోటీపడిన లోక్‌సభ ఎన్నికలు కూడా ఇవే కావడం గమనార్హం. 2009లో 85 శాతం, 2014లో 84 శాతం అభ్యర్థులు డిపాజిట్ కోల్పోయారు.

**బీఎస్పీలో ఎక్కువ..**

2019 ఎన్నికల్లో 86 శాతం మంది అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. పార్టీ వారీగా చూస్తే బీఎస్పీ అగ్రస్థానంలో నిలిచింది. 383 మంది పోటీ చేస్తే అందులో 345 మంది ధరావతు కోల్పో యారు. ఈ తర్వాతి స్థానంలో ఉన్న కాంగ్రెస్‌లో.. 421 అభ్యర్థులకు గాను 148 మంది డిపాజిట్ కోల్పోవడం గమనార్హం. ధరావతు కోల్పోతామని ముందే తెలిసినా తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు అనేక మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి ప్రదర్శిస్తారని విశ్లేషకులు చెబుతున్నారు.

.మరికొందరు మాత్రం అసలైన అభ్యర్థులకు నకలుగా (ప్రాక్సీగా) వారిని బరిలో దించుతారని పేర్కొంటు న్నారు. తొలి సార్వత్రిక ఎన్నికల సమయంలో సెక్యూరిటీ డిపాజిట్ కింద జనరల్ అభ్యర్థులకు రూ.500, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రూ.250 ఉండేది. ప్రస్తుతం అది జనరల్ అభ్యర్థులకు రూ.25 వేలు, ఎస్సీ/ఎస్టీలకు రూ.12,500లకు పెరిగింది. ఇలా డిపాజిట్ విలువ భారీగా పెంచినప్పటికీ అభ్యర్థుల సంఖ్యను ఇది కట్టడి చేయలేకపోతోంది.

## మాజీ ఎమ్మెల్యే షకీల్ తనయుడు
# రాహిల్‌కు బిగుస్తున్న ఉచ్చు

**జూబ్లీహిల్స్ రోడ్డుప్రమాద ఘటనపై మరోసారి దర్యాప్తు - ఉన్నతాధికారుల ప్రమేయంపై తాజాగా ఆరా**

హైదరాబాద్: బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ తనయుడు రాహిల్‌పై మరో కేసులో ఉచ్చు బిగుస్తోంది. పంజాగుట్ట ఠాణా పరిధిలోని అప్పటి సీఏం క్యాంపు కార్యాలయం సమీపంలో రోడ్డుప్రమాదం కేసులో పరారీలో ఉన్న అతడిపై ఇప్పటికే లుకవుట్ సర్క్యులర్ జారీ అయిన సంగతి తెలిసిందే. మరో రోడ్డుప్రమాద ఘటనలో అతడి ప్రమేయముందనే అనుమానంతో పోలీసులు కేసును తిరగదోడుతున్నారు. జూబ్లీహిల్స్ రోడ్‌నం.45 ప్రాంతంలో 2022 మార్చి 17న జరిగిన రోడ్డుప్రమాదంలో 2 నెలల చిన్నారి మృతిచెందిన ఘటనకు సంబంధించిన కేసులో దర్యాప్తును తిరిగి ప్రారంభించడం చర్చనీయాంశమైంది. ఆరోజు దుర్గంచెరువు కేబుల్‌బ్రిడ్జి వైపు నుంచి జూబ్లీహిల్స్ వైపు వచ్చిన థార్ వాహనం రాత్రి 8 గంటలకు రోడ్డు దాటుతున్న యాచకులను ఢీకొట్టింది. కాజల్, సారిక, సుష్మ గాయపడగా కాజల్ చేతిలోని రెండునెలల బాలుడు దుర్మరణం పాలయ్యాడు. కారులోని ఉన్న ముగ్గురు పారిపోయారు. ఆ కారుకు ఎమ్మెల్యే స్టిక్కర్ ఉంది. బోధన్



ఎమ్మెల్యే వాహనంగా తేలింది ఆ కారులో తన తనయుడు రాహిల్ లేడని షకీల్ తెలిపారు. దర్యాప్తు ముమ్మరం కావడంతో ఆఫ్రాన్ తానే కారు నడిపానంటూ లొంగిపోయాడు. స్టీరింగ్‌పై వేలిముద్రలు ఆఫ్రాన్ వేలిముద్రలతో సరిపోలాయని పోలీసులు ప్రకటించారు.

**బాధితురాళ్ల వాంగ్మూలాల సేకరణ**

ఆ కారులో మాజ్ అనే మరో యువకుడితోపాటు రాహిల్ ఉన్నట్లు అప్పటి దర్యాప్తులో తేలడంతో కేసు మలుపు తిరిగింది. సీసీ ఫుటేజ్‌తోపాటు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఈ విషయం గుర్తించినట్లు పోలీసులు ప్రకటించారు. ఇటీవలే రాహిల్ తన కారుతో సీఎం క్యాంపు కార్యాలయం వద్ద రోడ్డుప్రమాదం చేసిన నేపథ్యంలో పాతకేసుపై పశ్చిమ మండలం డీసీపీ విజయ్‌కుమార్ దృష్టి సారించారు. కేసు దర్యాప్తును తిరిగి ప్రారంభించారు. అప్పట్లో కేసులో 304-బి సెక్షన్‌ను చేర్చకపోవడంతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ గురించి ఆరా తీయకపోవడం లాంటి కారణాల గురించి ఆరా తీస్తున్నారు. మహారాష్ట్రకు వెళ్లి బాధితురాళ్లను నగరానికి తీసుకొచ్చి వారితోపాటు మరికొందరి వాంగ్మూలాలు సేకరించారు. ఘటన జరిగిన రోజు డ్రైవింగ్‌సీట్ నుంచి లావుగా ఉన్న యువకుడు పారిపోయాడంటూ బాధితురాళ్లు వాంగ్మూలం ఇచ్చినట్లు సమాచారం. దీన్నిబట్టి రాహిల్ డ్రైవింగ్ సీట్లో ఉన్నట్లు పోలీసులు నమ్ముతున్నారు. రాహిల్‌ను కేసునుంచి తప్పించే ప్రయత్నంలో ఒకరిద్దరు ఉన్నతాధికారుల ప్రమేయముందని ప్రస్తుత దర్యాప్తు బృందం అనుమానిస్తుండటం కీలకంగా మారింది.

## సీఏఏపై స్టే కోరుతూ పిటిషన్లు..
## కేంద్రానికి మూడు వారాల
# గడువిచ్చిన సుప్రీం




దిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు ముందు పౌరసత్వ సవరణ చట్టాన్ని కేంద్రం అమల్లోకి తీసుకు రావడం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టు లో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై మంగళవారం విచారణ జరిపిన న్యాయస్థానం కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. ఈ చట్టం అమలుపై స్టే విధించాలని పిటిషనర్లు కోరగా.. కోర్టు ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. 2019లో పార్లమెంట్ ఆమోదం పొందిన సీఏఏను సవాల్ చేస్తూ అప్పట్లోనే సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. నిబంధనలు ఇంకా నోటిఫై చేయకపోవడంతో ఆ చట్టం అమల్లోకి రాలేదని కేంద్రం నాడు న్యాయస్థానానికి వెల్లడించింది. ఈ క్రమంలోనే ఇటీవల పౌరసత్వ సవరణ నిబంధనలు-2024ను సర్కారు నోటిఫై చేయడంతో చట్టం అమలవుతోంది. దీంతో ఈ అంశం మళ్లీ కోర్టుకు చేరింది. సీఏఏ రాజ్యాంగ చట్టబద్ధతను సవాల్ చేస్తూ ఇప్పటికే దాఖలైన దాదాపు 200 పిటిషన్లపై తీర్పు వచ్చేవరకు ఆ చట్టం నిబంధనల అమలుపై స్టే విధించాలని తాజాగా పిటిషనర్లు కోరారు. వీటిపై నేడు విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్లపై మూడు వారాల్లోగా తమ సమాధానం తెలియజేయాలని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను ఏప్రిల్ 9వ తేదీకి వాయిదా వేసింది. అయితే, అప్పటిదాకా చట్టం అమలుపై స్టే విధించాలని పిటిషనర్లు న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై ధర్మాసనం ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. అంటే.. సీఏఏ అమలు యథావిధిగా కొనసాగనుంది. కాగా.. ఈ చట్టంతో ఏ వ్యక్తి పౌరసత్వాన్ని తొలగించబోమని విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు.

# కబ్జా కోరల్లో ఆలయం గుట్ట

**- చోద్యం చూస్తున్న అధికారులు**

**- ప్రజాప్రతినిధుల అండదండలతోనే అంటున్న స్థానికులు**





### తిరిగి దేవాలయానికి అప్పగించాలి

**కొమిరె శంకర్, ఆలయ కమిటి చెర్మెన్, రుద్రంగి**



శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన ఐదు ఎకరాల స్థలం ఉంది, కొందరు భూకబ్జాదారులు గుట్టను సైతం వదలకుండా ఇండ్లు నిర్మించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఆక్రమించిన భూమిని తిరిగి దేవస్థానికి అప్పజెప్పాలి. లేదంటే వారిని గుర్తించి తగు చర్యలు తీసుకుంటాం

రుద్రంగి, (మార్చి 19) (ప్రజాకలం ప్రతినిధి): నూతనంగా మండలం ఏర్పడి ఏండ్లు గడుస్తున్న ఇప్పటి వరకు ఒక్క ప్రభుత్వ కార్యాలయం నిర్మించలేదు. ఇందుకు కారణం ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించేందుకు ఖాళీ భూములు మండలకేంద్రంలో దొరకట్లేదని అంటునట్టు వినికిడి, కాని భూ కబ్జా దారులు మాత్రం ఎక్కడ కన్నుపడితే అక్కడ ప్రజాప్రతినిధుల అండదండలతో భూమి మాయం చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఐదు ఎకరాల గుట్ట ఉండగా భూకబ్జా దారులు గుట్టను సైతం మాయం చేస్తున్నారు. కాలేజీ పక్కనే ఆనుకొని ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన భూమిని ఆక్రమించి ఏకంగా ఇంటికి సంబందించిన బేస్మెట్ కట్టాడు. అధికారులు దృష్టిపెడితే ఆక్రమనకు గురైన మరిన్ని భూములు కనపడుతాయని వెంటనే స్పందించి ఆక్రమనకు గురైన భూమిని తిరిగి దేవస్థానానికి అప్పగించాలని స్థానికులు కోరుతున్నారు.



## ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం ఇవ్వాలి
**- హరీశ్‌రావు**

హైదరాబాద్: అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. గత మూడురోజులుగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈదురుగాలులు, వడగళ్ల వాన కురుస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కారుకు కేవలం రాజకీయాలే తప్ప రైతుల సమస్యలు పట్టడం లేదన్నారు. ఈ మేరకు ఎక్స్ (ట్విటర్)లో ఆయన పోస్టు చేశారు. "గతంలో అకాల వర్షాలకు రైతులు నష్టపోతే అప్పటి సీఎం కేసీఆర్ ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం ఇచ్చారు. వడగళ్ల వానతో ఆదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, రంగారెడ్డి తదితర జిల్లాల్లో పంట నష్టం అంచనా వేయాలి. వర్షంతో వరి, మొక్కజొన్నతో పాటు మామిడి సహా మరికొన్ని ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం కలిగింది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం ప్రకటించాలి. ఎకరాకు రూ.10వేలు ఇవ్వాలి" అని డిమాండ్ చేశారు.

# ఎన్డీఏ 'మహా' వ్యూహం..
**- ఉద్ధవ్‌కు చెక్ పెట్టేందుకు రంగంలోకి రాజ్..!**

హైదరాబాద్: శివసేన ఉద్ధవ్ వర్గం భారీ సంఖ్యలో ఓట్లను చీల్చకుండా ఎన్‌డీఏ కూటమి వ్యూహానికి మరింత పదును పెట్టింది. వీలైనన్ని పార్టీలను కూటమిలో చేర్చుకొని మహారాష్ట్రలో అత్యధిక పార్లమెంట్ స్థానాలను సాధించాలని చూస్తోంది. ఉద్ధవ్ సోదరుడు, మహారాష్ట్ర నవ్‌నిర్మాణ్ సేన అధినేత రాజ్ ఠాక్రేను తమ జట్టులో చేర్చుకొనేందుకు ఎన్డీఏ పావులు కదుపుతోంది. దీనిలో భాగంగానే రాజ్ తన కుమారుడుతో కలిసి దిల్లీలో భాజపా అగ్రనాయకుడు అమిత్‌షాతో భేటీ అయ్యారు. ఈ పరిణామాలతో లోక్‌సభ ఎన్నికల వేళ కూటమిలో చేరడం ఖాయమనే ప్రచారం జోరందుకొంది. సోమవారం రాత్రే రాజ్ తన కుమారుడితో కలిసి దిల్లీకి వెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "దేశ రాజధానికి రమ్మని పిలిచారు. వచ్చాను.. చూద్దాం ఏం జరుగుతుందో'' అని విలేకర్ల వద్ద వ్యాఖ్యానించారు. అప్పటికే మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాంకులే దిల్లీలోనే ఉన్నారు. పొత్తులో భాగంగా ఎంఎన్‌సీ వర్గం దక్షిణ ముంబయి, శిరిడీ లోక్‌సభ సీట్లను డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

**పరస్పర అవసరాలే కలిపాయా..**

2019 లోక్‌సభ ఎన్నికల్లో భాజపా-శివసేన కూటమి మహారాష్ట్రలో పోటీ చేసింది. నాడు మొత్తం 48 సీట్లలో 41 సాధించింది. కొన్ని నెలల తర్వాత జరిగిన రాష్ట్ర ఎన్నికల్లో కూడా ఈ కూటమి విజయం సాధించింది. అధికారం పంచుకొనే విషయంలో ఇరు పక్షాల మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో శివసేన ఎన్డీఏను వీడి మహా వికాస్ అఘాడీ(కాంగ్రెస్-ఎన్సీపీ)తో జట్టుకట్టింది. కొంతకాలం ప్రభుత్వం



సజావుగా సాగినా.. 2022లో శివసేన సీనియర్ నేత ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని వర్గం తిరుగుబాటు ప్రకటించింది. వీరు భాజపాతో చేతులు కలిపారు. దీంతో రాష్ట్రంలో అధికారం ఎన్డీఏ వశమైంది. ఆ తర్వాత పార్టీ, గుర్తును ఉద్ధవ్ వర్గం కోల్పోయింది. ఈ సమయంలో రాజ్, శిందే వర్గానికి మద్దతుగా నిలిచారు. ఉద్ధవ్ కారణంగానే పార్టీ చీలిపోయిందని ఆరోపించారు. ఇక మరోవైపు ఎన్సీపీలో కూడా అజిత్ పవార్ నేతృత్వంలో తిరుగుబాటు చోటు చేసుకొంది. అత్యధిక మంది ఎన్‌డీఏతో జట్టుకట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్ధవ్ వర్గానికి సానుభూతి లభిస్తే ప్రతికూలంగా మారుతుందని భాజపా అంచనావేస్తోంది. పెద్ద రాష్ట్రం కావడంతో ఏ మాత్రం రిస్క్ చేయడానికి ఇష్టపడటంలేదు. ఠాక్రే కుటుంబంలోని మరో ప్రజాకర్షక నేత రాజ్‌ను తమ పక్షాన చేర్చుకొనేందుకు పావులు కదిపింది. బాల్ ఠాక్రేకు స్వయాన సోదరుడి కుమారుడే రాజ్. ఆయన ఉద్ధవ్‌తో విభేదాల కారణంగా 2006లో శివసేన నుంచి బయటకు వెళ్లిపోయారు. 2009లో అతడి నేతృత్వంలోని ఎంఎన్‌సీ 13 ఎమ్మెల్యే స్థానాలను సాధించింది. కానీ, 2014, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం తీవ్రంగా దెబ్బతింది. ఇప్పుడు ఆ పార్టీ తిరిగి బలపడాలంటే ఓ పెద్ద అండ అవసరం. భాజపా రూపంలో అది లభిస్తుందని రాజ్ ఆశిస్తున్నారు. సీట్ల పంపిణీ ఓ కొలిక్కి వచ్చి ఎన్డీఏలో చేరితే ఎంఎన్‌సీకి పుంజుకోవడానికి అవకాశం లభించినట్లే.